సాక్షి
కామారెడ్డి
బుధవారం। 29। జనవరి। 2025



నిబంధనలు పాటించాలి

విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని డీటీవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

- 8లో ▸



సమస్యలు పరిష్కరించాలి

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన ఏజెన్సీల కార్మికులు ధర్నా చేశారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.8 /12.5

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొన సాగుతుంది.

న్యూస్‌రీల్

అపార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి



రాజంపేట: అపార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని డీఈవో రాజు సూచించారు. మంగళవారం రాజంపేట మండల పరిషత్ పాఠశాలను సందర్శించి పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం అపార్(ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)ను పరిశీలించారు. జిల్లాలోని ప్రతి పాఠశాలలో అపార్‌ను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం కేజీబీవీని సందర్శించారు. పదో తరగతి వార్షిక పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

పోచారం నీటి విడుదల



నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు నుంచి మంగళవారం రెండోవిడత నీటిని విడుదల చేశారు. 15 రోజులపాటు ప్రధాన కాలువకు నీటిని విడుదల చేయనున్నారు. రోజూ 180 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేయనున్నారు. మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్టులో 1.30 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రైతులు నీటిని సక్రమంగా వినియోగించుకోవాలని ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు కోరారు.

'చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి'



నాగిరెడ్డిపేట: మహిళా చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సఖి కేంద్రం జిల్లా అధికారి భారతి సూచించారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం పదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ నిషేధ చట్టం, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిర్మూలన, పోక్సో తదితర చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళలు మిషన్ శక్తి, సుకన్య సమృద్ధి యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ శారద, జిల్లా మిషన్ శక్తి కోఆర్డినేటర్ శిరీష, సఖి కేంద్రం అడ్మినిస్ట్రేటర్ సాయవ్వ, పీహెచ్‌సీ డాక్టర్ సృజన్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

'రూ.100 కోట్ల ఉపాధి పనులు చేశాం'



నాగిరెడ్డిపేట: జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు సుమారు రూ.100 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులు చేపట్టినట్లు డీఆర్‌డీవో సురేందర్ తెలిపారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ ఆవరణలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 1.10 లక్షల కుటుంబాలకు 37.97 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. ఇప్పటివరకు 551 కుటుంబాలు వందరోజుల పనిదినాలను పూర్తి చేసుకున్నాయన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా గతంలో చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు ఎక్కువగా జరిగేవని, ప్రస్తుతం గ్రామానికి, ప్రజలకు ఉపయోగపడే ఫార్మేషన్ రోడ్లు, ఫాం పాండ్ పనులను చేపడుతున్నామని వివరించారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి రత్నం, ఎంపీడీవో ప్రభాకర్‌చారి, ఎస్‌ఆర్‌పీ తిరుపతి, ఈసీ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సాగు పథంలో..



జిల్లాలో యాసంగి పంటల సాగు జోరందుకుంది. ఇప్పటి వరకు 3,85,182 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వరి పంటే ఎక్కువ విస్తీర్ణంలో వేశారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో నాట్లు పడుతూనే ఉన్నాయి. దీంతో వరి సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశాలున్నాయి.

- యాసంగిలో 3.85 లక్షల ఎకరాల్లో పంటలు
- వరి పంటదే సింహభాగం
- ఇప్పటికే చేతికొచ్చిన శనగ
- ఆశాజనకంగా పంటల సాగు

జిల్లాలో యాసంగిలో సాగవుతున్న పంటల వివరాలు.. (ఎకరాలలో)

పంట	సాగు విస్తీర్ణం				
		జొన్న	25,096	పల్లి	506
వరి	2,61,109	మినుము	2,677	పొగాకు	495
శనగ	58,766	రాజ్మా	1,728	కుసుమ	485
మక్క	32,702	పొద్దుతిరుగుడు	1,179	గోధుమ	376

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : వర్షాకాలంలో కురిసిన వర్షాలతో ప్రాజెక్టులు, చెరువులలో నీరు పుష్కలంగా ఉండడంతో రైతులు ఆశాజనకంగా యాసంగి పంటల సాగు పనులు ప్రారంభించారు. బావులు, బోర్లలో కూడా నీరుండడంతో రైతులు ఎక్కువగా వరి సాగుకు మొగ్గు చూపారు. 2.36 లక్షల ఎకరాలలో వరి సాగవుతుందని అధికారులు అంచనా వేయగా.. వారి అంచనాలకు మించి 2.61 లక్షల ఎకరాలలో వరి నాట్లు పడ్డాయి. కొన్ని ప్రాంతాలలో ఇంకా నాట్లు కొనసాగుతున్నాయి. ప్రధానంగా నిజాంసాగర్, కౌలాస్, పోచారం ప్రాజెక్టుల కింద వరి పంట సాగు చేస్తున్నారు. అలాగే జిల్లాలో లక్షకు పైచిలుకు బోర్లు, బావులున్నాయి. వాటి కింద కూడా ఎక్కువగా వరి సాగవుతోంది. బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ ప్రాంతాల్లో మొదటగా వరి నాట్లు పూర్తి చేశారు. తర్వాత మిగతా ప్రాంతాల్లో నాట్లు వేశారు.

మురిపిస్తున్న మొక్కజొన్న

యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న పంట బాగుంది. దీంతో రైతులు మక్కపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో 32,702 ఎకరాల్లో మక్క పంట సాగైంది. కాగా ముందుగా విత్తనం వేసిన ప్రాంతాల్లో ఇప్పటికే మక్క ఏపుగా పెరిగి జుట్టేసింది. పెద్దగా తెగుళ్లు లేకపోవడంతో రైతులు ఆశలు పెంచుకున్నారు. మక్క పంటకు అడవి జంతువుల బెడద ఉండగా, వాటి నుంచి కాపాడుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలోని తాడ్వాయి, రాజంపేట, గాంధారి, మాచారెడ్డి, భిక్కనూరు, సదాశివనగర్, లింగంపేట తదితర మండలాల్లో మక్క పంట ఎక్కువగా సాగయ్యింది.

చెరుకు సాగుకు ప్రోత్సాహం

పెట్టుబడులు పెరగడం, కూలీల సమస్యలతో జిల్లాలో చాలా మంది రైతులు చెరుకు సాగుకు దూరమయ్యారు. అయితే చెరుకు సాగును ప్రోత్సహించడానికి గాయత్రి షుగర్స్ యాజమాన్యం ప్రోత్సాహకాలు అందిస్తుండడంతో పలువురు రైతులు తిరిగి ఈ పంటవైపు దృష్టి సారిస్తున్నారు. అలాగే చెరుకు నరికి ఫ్యాక్టరీకి తరలించిన రైతులు తిరిగి విత్తనాలు నాటేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

శనగ పంట కోసి..

వానాకాలం పంటలు కోతలు కాగానే రైతులు శనగ విత్తనం వేశారు. ముఖ్యంగా మక్క పంట కోయగానే దాని అడుగులో ఈ పంట సాగు చేశారు. జిల్లాలో 58,766 ఎకరాల్లో శనగ పంట సాగైంది. పంటకు ఎక్కువగా సాగునీరు అవసరం ఉండదు. చలికాలంలో కురిసే మంచుతో పంట పండుతుంది. ఈ పంటకు పెద్దగా చీడపీడల సమస్య కూడా ఉండదు. దీంతో యాసంగిలో రైతులు చాలా మంది శనగ సాగుకు ఆసక్తి చూపారు. జిల్లాలో చాలా చోట్ల ఇప్పటికే శనగ పంట చేతికి రావడంతో పంటను తీసి ఆరబెడుతున్నారు.

ఆయిల్‌పాం సాగుకు వెనుకంజ!

- ఆసక్తి చూపని రైతులు
- లక్ష్యానికి దూరంగానే సాగు..

నాగిరెడ్డిపేట: ఆయిల్‌పాం పంటను సాగు చేస్తే ఎక్కువ లాభాలు వస్తాయని నాలుగేళ్ల క్రితం అధికారులు విస్తృతంగా ప్రచారం చేయడంతో పలువురు రైతులు ఆ పంట సాగుకు ముందుకు వచ్చారు. అయితే ఏళ్లు గడుస్తున్నా కొద్దీ ఈ పంటపై రైతుల్లో ఆసక్తి తగ్గిపోతోంది. కొత్తగా ఈ పంట సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు.

344 ఎకరాల్లోనే..

ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 2 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగుచేయాలని ఉద్యాన శాఖ అధికారులు లక్ష్యం నిర్దేశించుకున్నారు. కానీ ఇప్పటివరకు 344 ఎకరాల్లోనే మొక్కలు నాటారు. లక్ష్యం చేరుకునేందుకు ఇంకా రెండు నెలల సమయమే ఉంది. ఆలోగా లక్ష్యాన్ని చేరుకోవడం అసాధ్యమనే భావిస్తున్నారు. ఆయిల్‌పాం సాగు చేసే రైతులకు ఏడాదికి ఎకరానికి రూ. 4,200 చొప్పున నాలుగేళ్లపాటు నిర్వహణ ఖర్చులను చెల్లిస్తారు. దీంతోపాటు డ్రిప్ సదుపాయం కోసం రాయితీపై పరికరాలను అందిస్తారు. అయినా కూడా ఆయిల్‌పాం సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు. అధికారులు ఆయిల్‌పాం సాగుపై అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నా ఫలితం ఉండడం లేదు.

నాలుగేళ్లు వేచి ఉండలేక..

జిల్లాలో ఎక్కువగా వరి సాగవుతుంది. ఈ పంట నాలుగు నెలల్లోనే చేతికి వస్తుంది. ఆయిల్‌పాం దీర్ఘకాలిక పంట. నాలుగేళ్ల తర్వాత దిగుబడులు ప్రారంభమవుతాయి. పెట్టుబడి పెట్టి అంత కాలం ఎదురుచూసే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఈ పంట సాగుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. గతంలో వేసిన ఆయిల్‌పాం పంట దిగుబడులు వచ్చే ఏడాదినుంచి అందనున్నాయి. ఆ దిగుబడులను చూసి రైతులకు పూర్తిస్థాయి అవగాహన కలుగుతుందని ఉద్యానశాఖ అధికారులు పేర్కొంటున్నారు. రైతులకు అవగాహన పెరిగితే జిల్లాలో ఆయిల్‌పాం సాగు విస్తీర్ణం పెరుగుతుందని భావిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ ఏడాది జిల్లాలో 2 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవ్వాలన్నది లక్ష్యం. సమయం తక్కువగా ఉన్నందున కనీసం వెయ్యి ఎకరాలలోనైనా ఆయిల్‌పాం మొక్కలు నాటడానికి ప్రయత్నిస్తున్నాం.

– జ్యోతి, జిల్లా ఉద్యానశాఖ అధికారి, కామారెడ్డి



నాగిరెడ్డిపేటలో సాగవుతున్న ఆయిల్‌పాం

ఖాతాల్లోకి 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించిన నిధులు మంగళవారం లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యాయి. భూమిలేని రైతు కూలీలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద లబ్ధిదారుకు ఏటా రూ. 12 వేలు అందించనున్నారు. తొలి విడతలో మంగళవారం రూ. 6 వేలు లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు. 22 గ్రామాలకు చెందిన 273 మంది ఖాతాలలో రూ. 16.38 లక్షలు జమ అయ్యాయని అధికారులు తెలిపారు.

జిల్లాలో 535 గ్రామాలు ఉండగా.. పైలట్ ప్రాజెక్టుగా ఒక్కో మండలంలో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి నాలుగు పథకాలను రిపబ్లిక్ డే రోజున ప్రారంభించారు. సోమవారం జిల్లాలో ఎంపిక చేసిన 22 గ్రామాల రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ అయ్యాయి. మంగళవారం ఇందిరమ్మ భరోసా నిధులు జమ చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్ ఆదివారమే అందించారు. రేషన్ కార్డులకు సంబంధించిన పత్రాలు కూడా ఇచ్చారు. వచ్చే నెల నుంచి వారికి రేషన్ బియ్యం అందనున్నాయి.

కొత్త మండలాల్లో మండల పరిషత్‌లు

- ఇన్‌చార్జి ఎంపీడీవోల నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన సర్కారు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలోని పాల్వంచ, మహ్మద్‌నగర్, డోంగ్లీ మండలాల్లో మండల పరిషత్ కార్యాలయాలు ఏర్పాటు చేయడంతో పాటు ఇన్‌చార్జీ ఎంపీడీవోలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మాచారెడ్డి మండలంనుంచి పాల్వంచ, నిజాంసాగర్ మండలంనుంచి మహ్మద్‌నగర్, మద్నూర్ మండలంనుంచి డోంగ్లీ మండలాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ సీఈవో ఆయా మండలాల్లో మండల పరిషత్ కార్యాలయాలకు భవనాలను ఎంపిక చేసి, అధికారులను నియమించారు. పాల్వంచ మండల మండల పరిషత్ కార్యాలయాన్ని ప్రాథమిక సహకార సంఘ భవనంలో ఏర్పాటు చేయనున్నారు. మహ్మద్‌నగర్ మండలానికి సంబంధించి స్థానిక గ్రామ పంచాయతీ భవనం పైఅంతస్తులో మండల పరిషత్ ఏర్పాటు చేస్తారు. డోంగ్లీ మండల పరిషత్ కార్యాలయాన్ని స్థానిక ప్రాథమిక సహకార సంఘం భవనంలో ఏర్పాటు చేయనున్నారు. పాల్వంచ ఎంపీడీవోగా ప్రస్తుతం మాచారెడ్డి మండల పరిషత్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను నియమించారు. మహ్మద్‌నగర్ ఎంపీడీవోగా నిజాంసాగర్ ఎంపీవో అనితారెడ్డిని, డోంగ్లీ ఎంపీడీవోగా మద్నూర్ ఎంపీవో వెంకటనారాయణను నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఆయా మండలాలకు కావలసిన ఫర్నిచర్‌ను ప్రస్తుతం ఉన్న ఉమ్మడి మండల పరిషత్ కార్యాలయం నుంచే సర్దుబాటు చేసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.



మహ్మద్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం

'కృత్రిమ గర్భధారణతో మేలుజాతి దూడల జననం'

రామారెడ్డి : కృత్రిమ గర్భధారణతో మేలుజాతి దూడలు జన్మిస్తాయని జిల్లా పశుగణాభివృద్ధి అధికారి మజీద్ పేర్కొన్నారు. మంగళవారం మోషంపూర్‌లో రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మజీద్ మాట్లాడుతూ పాడి రైతులు తమ పశువులలో ఎద లక్షణాలు గమనించి సరైన సమయంలో కృత్రిమ గర్భధారణ చేయించాలని సూచించారు. శిబిరంలో పశువులకు రామారెడ్డి మండల పశు వైద్యాధికారి రామచందర్ చూడి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 40 సాధారణ చికిత్సలు, 51 గర్భకోశ వ్యాధుల చికిత్సలు, ఒక కృత్రిమ గర్భధారణ, 22 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో వీఎల్‌వో శ్రీనివాస రావు, పాడిరైతులు రాజిరెడ్డి, రాములు, అనిల్ రెడ్డి, రాజు, భూమయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేసి మాట నిలబెట్టుకోవాలి

- తపస్ బలపరిచిన బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య

బాన్సువాడ: సీపీఎస్‌ను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని తపస్ బలపరిచిన బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య అన్నారు. మంగళవారం బాన్సువాడలో మల్క కొమరయ్య ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, జీపీఎస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. పీఆర్సీ ప్రకటించి వెంటనే అమలు చేయాలని, నెల నెలా ప్రమోషన్లు ఇవ్వాలని అన్నారు. జీవో-317 ద్వారా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు సొంత జిల్లాలకు పంపించాలన్నారు. వచ్చే నెల 8న ఇందిరాపార్కు వద్ద తపస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవతా సురేష్ తెలిపారు. తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాఘవరెడ్డి, భూనేకర్ సంతోష్, రాష్ట్ర బాధ్యులు రవీంద్రనాథ్‌ఆర్య, రమేష్, లక్ష్మణచారి, భాస్కర్, శివకాంత్, తదితరులున్నారు.



బాన్సువాడలో మాట్లాడుతున్న కొమరయ్య

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- అవసరమైన ఏర్పాట్లు చేయండి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చేనెల 3 నుంచి 22 వ తేదీ వరకు 48 కేంద్రాలలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయన్నారు. మార్చి 5 నుంచి 25 వరకు 38 కేంద్రాలలో థియరీ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షల నిర్వహణ సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆయా రూట్లలో బస్సులు నడపాలన్నారు. పరీక్షలకు అవసరమైన ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంట్ ఆఫీసర్స్‌గా ప్రభుత్వ కళాశాలల్లోని సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లో పోలీసు సిబ్బంది ఉండాలన్నారు. ఇన్విజిలేషన్ విధులకు అవసరమైన ఉపాధ్యాయులను కేటాయించాలని జిల్లా విద్యా శాఖాధికారి రాజును ఆదేశించారు. అత్యవసర వైద్య సేవలు అందించడానికి ప్రతి పరీక్ష కేంద్రం వద్ద వైద్య సిబ్బందిని మందులతో సహా అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా ఇంటర్ విద్యాధికారి షేక్ సలాం, డీపీవో శ్రీనివాస్‌రావు, డీఈవో రాజు, ఆర్టీసీ, వైద్య, పోస్టల్, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా అధికారులు

కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగాలి

కామారెడ్డి టౌన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవం, స్పోర్ట్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని 20 ప్రభుత్వ కళాశాలల్లో ఎంపిక చేసిన విద్యార్థులకు జేఈఈ ఎంట్రెన్స్‌కోసం ఆన్‌లైన్ ద్వారా కోచింగ్ ఇప్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. దాతల సహకారంతో కళాశాలకు అవసరమైనవి సమకూర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి షేక్ సలాం, కళాశాల ప్రిన్సిపాల్ జయకుమారి, దాతలు వైద్యులు రవీందర్‌రెడ్డి, అరవింద్, కృప, కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

క్లుప్తంగా

'మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలి'



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మహిళా సంఘాల సభ్యుల్లో ఆత్మస్థైర్యం నింపేలా సీసీలు, వీవోఏలు పనిచేయాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయంలో మంగళవారం నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, లింగంపేట మండలాలకు చెందిన సీసీలు, వీవోఏలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు సీసీలు, వీవోఏలు కృషి చేయాలన్నారు. కొన్ని గ్రామాల్లో సీసీలకు, వీవోఏలకు సఖ్యత కొరవడిందని, వీవోఏలు, సీసీలు సమన్వయంతో పనిచేస్తూ మహిళాసంఘాల అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. బ్యాంకు లింకేజీ డీపీఎం రవీందర్‌రావు, ఎల్లారెడ్డి ఏపీఎం ప్రసన్నరాణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కామారెడ్డి టౌన్ : మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి మాట్లాడారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా ఎండీఎం కార్మికులకు మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. నిర్వాహకులకు కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, అలాగే గ్యాస్ సిలిండర్‌లను కూడా అందజేయాలని కోరారు. కార్మికులు సాయిలు, సోఫియా, సంగీత, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో జెడ్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



ఫరీదుపేటలో యూపీఎస్ ప్రతుల దహనం



లింగంపేట మండలం అయిలాపూర్ ఉన్నత పాఠశాలలో..

యూపీఎస్ వద్దు.. ఓపీఎస్ ముద్దు



జిల్లా కేంద్రంలో ఇరిగేషన్ కార్యాలయం ఎదుట..



యూపీఎస్ వద్దంటూ కలెక్టరేట్‌లో ఉద్యోగుల నిరసన

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలవుతున్న సీపీఎస్ స్థానంలో ఏప్రిల్ 1న కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న యూపీఎస్‌కు వ్యతిరేకంగా జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు మంగళవారం ఆందోళనలకు దిగారు. యూపీఎస్ వద్దు..ఓపీఎస్ ముద్దు అంటూ ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నినాదాలు చేస్తూ యూపీఎస్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని ఉద్యమాలు చేస్తుంటే ఇప్పుడు కొత్తగా కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ విధానాన్ని అమలు చేస్తాననడం దారుణమన్నారు. ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజకరంగా లేని యూపీఎస్‌ను అమలు చేస్తే పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.



ఎల్లారెడ్డి సబ్ ట్రెజరీ కార్యాలయ ప్రాంగణంలో..

యువత సేవలు అభినందనీయం



ప్రశంసాపత్రాలు అందుకున్న యువకులతో ఏసీపీ నారాయణ

నిజామాబాద్‌నాగారం: రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా యువకులు స్వచ్ఛందంగా ట్రాఫిక్ పోలీసుల విధులను అధ్యయనం చేయడం కోసం ముందుకు రావడం, విధుల్లో పాలుపంచుకోవడం అభినందనీయమని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ అన్నారు. మేరా యువభారత్ నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేయబడిన 25మంది యువకులు రెండు రోజుల పాటు నగరంలోని పలు జంక్షన్ల వద్ద విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌తోపాటు కలిసి ట్రాఫిక్ నిర్వహణలో శిక్షణ తీసుకున్నారు. ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. రెండు రోజులపాటు ట్రాఫిక్ పోలీసులతో కలిసి వారికి విధుల్లో సహకరించటం నిజంగా అభినందనీయమని ఇలాంటి కార్యక్రమాల ద్వారా యువకుల్లో ఒక నిర్మాణాత్మకమైన మార్పు ఏర్పడుతుందని తద్వారా బాధ్యతాయుతమైన సమాజం నిర్మాణం అవుతుందన్నారు. జిల్లా యువజన అధికారిని శైలిబెల్లాల్ మాట్లాడుతూ.. ఎల్లప్పుడూ ప్రజల కోసం పని చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు నిజంగా అభినందనీయులన్నారు. అనంతరం యువకులకు ప్రశంసాపత్రాలు, డైరీ, పెన్నును అందించారు.



'సొంత జిల్లాలకు బదిలీ చేయాలి'

కామారెడ్డి అర్బన్: జీవో–317తో ఇతర జిల్లాల నుంచి జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయలను వెంటనే వారి సొంత జిల్లాలకు బదిలీలు చేయాలని టీఆర్‌టీఎఫ్ డిమాండ్ చేసింది. మంగళవారం డీఈవో రాజును టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బషీర్, ఇతర నేతలు కలిసి వినతి పత్రం అందజేశారు.

రథసప్తమి యోగా సూర్య నమస్కారాల పోటీలు



కామారెడ్డి అర్బన్: ప్రకృతి పునరుత్పత్తి, ఆరోగ్యం, ఆధ్యాత్మిక శక్తికి సూచికగా జరుపుకునే రథసప్తమిని పురస్కరించుకుని స్థానిక జిల్లా యోగా భవన్‌లో మంగళవారం మహిళలు, పురుషులకు వేర్వురుగా సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించినట్లు యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.రాంరెడ్డి తెలిపారు. మహిళల విభాగంలో ఎస్.హిమబిందు, ఎ.సంధ్య, పురుషుల విభాగంలో 60 ఏళ్ల పైబడిన విభాగంలో పి.అంజయ్య, సీహెచ్.బాపురెడ్డి, 40 ఏళ్ల పైబడిన వారి విభాగంలో కుంబాల ఎల్లయ్య, కిరణ్‌కుమార్, ఎం.శ్రీనివాస్, 25 ఏళ్ల పైబడిన వారి విభాగంలో ఎం.అజయ్, సీహెచ్. రాజ్‌కుమార్‌లు గెలుపొందారు. ఫిబ్రవరి 3న రథసప్తమి సందర్భంగా బహుమతులు అందజేస్తామని జి.రాంరెడ్డి తెలిపారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డీటీవో శ్రీనివాస్‌రెడ్డి



బాన్సువాడలో అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ శ్రీనివాస్

● జిల్లా రవాణా శాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి అర్బన్: విద్యార్థులు రోడ్డు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సమాజానికి ఆదర్శంగా ఉండాలని జిల్లా రవాణ శాఖాధికారి కె. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులందరూ డ్రైవింగ్ లైసెన్స్ తప్పకుండా తీసుకోవాలని, రోడ్డు నిబంధనలు పాటించి తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు నిజం చేయాలని సూచించారు. అతి వేగం, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం గాలిలో దీపం వంటిదని హెచ్చరించారు. ప్రాణ నష్టం, ప్రమాదాలను తగ్గించడమే రోడ్డు భద్రతా వారోత్సవాల ఉద్దేశమని వివరించారు.

సాంకేతికతతో రోడ్డు భద్రత చైతన్యాన్ని పెంపొందించాలి

బాన్సువాడ : ఆధునిక సాంకేతికత ద్వారా రహదారి భద్రతను చైతన్య పరుచుకోవచ్చునని మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో రహదారి మాసోత్సవంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం వలంటీర్ సునీల్ రాథోడ్, ఏఎంవీ ఎర్షాత్, ఎస్సై తాజొద్దీన్, కళాశాల ప్రిన్సిపల్ రాజు, హోంగార్డు అనీల్ తదితరులున్నారు.

పంచాయతీలో అవకతవకలపై విచారణ



విచారణ జరుపుతున్న డీఎల్‌పీవో శ్రీనివాస్

దోమకొండ: దోమకొండ గ్రామ పంచాయతీలో గతంలో జరిగిన అవకతవలపై కామారెడ్డి డీఎల్‌పీవో శ్రీనివాస్ మంగళవారం విచారణ జరిపారు. గతంలో ఇక్కడ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన సౌజన్య గ్రామంలో ఇళ్లు, ఇతర నిర్మాణాలకు ఆన్‌లైన్ ద్వారా కాకుండా మాన్యువల్‌గా పర్మిషన్ ఇచ్చి డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో పాటు మ్యుటేషన్, ప్రత్యేకాధికారి సంతకం లేకుండా బ్యాంకులో డబ్బులు డ్రా చేసినట్లు సైతం ఆమెపై ప్రస్తుత ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని పెట్రోల్ బంక్‌తో పాటు, రైస్‌మిల్‌లకు పర్మిషన్ సైతం ఆన్‌లైన్‌లో ఇవ్వలేదని దీంతో ప్రభుత్వానికి ఆదాయం రాకుండా పోయిందని ఆరోపణలు ఉన్నాయి. దోమకొండ నుంచి భిక్కనూరు మండలం బాగిర్తిపల్లి గ్రామానికి బదిలీపై వెళ్లిన రోజు కూడా బ్యాంకు నుంచి పంచాయతీ ప్రత్యేకాధికారి సంతకం లేకుండా డబ్బులు డ్రా చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిఎల్‌పీవో శ్రీనివాస్ ప్రాథమిక విచారణ జరిపారు. అప్పటి రికార్డులను పరిశీలించారు. ఈవో సౌజన్యతో మాట్లాడి ఆమె ఇచ్చిన సమాచారం నమోదు చేసుకున్నారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని డీఎల్‌పీవో తెలిపారు.

రెండు గ్రామాల్లో పోలీసు బందోబస్తు



రామేశ్వర్‌పల్లిలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లి, మల్లుపల్లి గ్రామాల్లో పోలీసులు మంగళవారం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మల్లుపల్లి గ్రామానికి చెందిన మాలె నారాయణ ఇటీవల సంగారెడ్డి జిల్లాలో హత్యకు గురైన విషయం తెలిసిందే. నారాయణ హత్య కేసులో రామేశ్వర్‌పల్లికి చెందిన రాకేశ్ నిందితుడిగా ఉన్నాడు. దీంతో మల్లుపల్లి గ్రామస్తులు నారాయణ మృతదేహాన్ని రామేశ్వర్‌పల్లికి తీసుకువచ్చేందుకు యత్నిస్తున్నారని పోలీసులకు సమాచారం అందడంతో బందోబస్తు ఏర్పాటు చేశారు. రామేశ్వర్‌పల్లికి చెందిన పెద్ద మనుషులు నారాయణ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో మలుపల్లి గ్రామస్తులు శాంతించారు. అనంతరం గ్రామంలో నారాయణ అంత్యక్రియలను పూర్తి చేశారు.

సమయపాలన పాటించని సిబ్బందిపై ఆగ్రహం



నస్రుల్లాబాద్(బాన్సువాడ): స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని జెడ్పీ సీఈవో చందర్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సమయ పాలన పాటించని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయానికి రాని వారి గురించి ఆరా తీశారు. వివిధ గ్రామాల్లో ఉన్నామంటూ చెప్పిన సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జెడ్పీ నిధులు రూ.1.30 కోట్లతో నిర్మిస్తున్న పీహెచ్‌సీ పనులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రజాపాలన కార్యక్రమం నిత్యం కొనసాగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఎంపీడీవో కార్యాలయంలో పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీడీవో సూర్యకాంత్ ఉన్నారు.

పంట వివరాలు అందించాలి

మద్నూర్(జుక్కల్): అవాల్‌గావ్, మద్నూర్ గ్రామాలకు చెందిన రైతులు తమ తమ పొలాల్లో వేసిన పంటల వివరాలను బుధవారం అందించాలని ఏఈవో సౌమ్యశ్రీ కోరారు. మండల కేంద్రంలోని మల్లేశ్వర ఆలయంలో బుధవారం మద్నూర్, అవాల్‌గావ్ శివారులో సాగు చేస్తున్న పంటల వివరాల నమోదు కోసం పట్టాపాస్ పుస్తకం తీసుకు రావాలని ఏఈవో సూచించారు.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్య

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రామ్ మంగళవారం తెలిపారు. సిరికొండలోని బంక మౌనిక(28) అనే వివాహితకు మానసిక స్థితి సరిగాలేదు. ఈక్రమంలో ఆమె తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త దిలీప్‌తో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలోని మాధవ నగర్ ప్రాంతంలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. వివరాలు ఇలా.. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మంద పోచయ్య(50) మంగళవారం కామారెడ్డిలో దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలులో ఎక్కి నిజామాబాద్ వైపుగా ప్రయాణించాడు. మాధవనగర్ క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలో అతడు ప్రమాదవశాత్తు రైలు నుంచి కాలు జారికింద పడ్డాడు. తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

నవీపేట: ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. వివరాలు ఇలా.. నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పొల్ద గ్రామానికి చెందిన ఉల్లెంగ శేఖర్ (27) అప్పుల బాధ భరించలేక ఈనెల 24న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మంగళవారం పరిస్థితి విషమించడంతో చికిత్సపొందుతూ అతడు మృతిచెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని బేగంపూర్ గ్రామ చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారిపై అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను సోమవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడ్డ వారిపై కేసు నమోదు చేసి, టిప్పర్‌ను తహసీల్దార్ దశరథ్‌కు అప్పగించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై మహేందర్ హెచ్చరించారు.

ఇసుక డంపు స్వాధీనం



నస్రుల్లాబాద్(బాన్సువాడ): నస్రుల్లాబాద్ మండల కేంద్రానికి దగ్గరలో ఉన్న ఇసుక డంపును సోమవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. సంబంధిత వ్యక్తులు సరైన ఆధారాలు చూపక పోవడంతో అక్రమంగా ఇసుక వ్యాపారం సాగుతుందని రెవెన్యూ అధికారుల విచారణలో వెల్లడైంది. దీంతో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి ఇసుక డంపును స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్దకు గిర్దావార్ సాయిలు తరలించారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను త్వరలో వేలం వేస్తామని అధికారులు తెలపారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

డబ్బుల కోసం తల్లిని హతమార్చిన కుమారుడు



మంగ్లీబాయి (ఫైల్)

రుద్రూర్: నవమాసాలు కని పెంచిన తల్లిని కనికరం లేకుండా నగలు, డబ్బుల కోసం కొడుకు హతమార్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పోతంగల్ మండలం జల్లాపల్లి ఫారంనకు చెందిన సేనావత్ మంగ్లీ బాయి (72)కి నలుగురు కుమారుల్లో ఇద్దరు గతంలోనే మరణించారు. రెండవ కుమారుడు రాములు మద్యానికి బానిసై, తల్లి వద్ద ఉన్న డబ్బులు ఇవ్వమని తరచు గొడవపడేవాడు. రాములు ప్రవర్తనతో విసుగు చెందిన భార్య గతంలోనే పుట్టింటికి వెళ్లిపోయింది. మూడు రోజుల క్రితం మద్యం మత్తులో ఉన్న రాములు డబ్బులు కావాలని తల్లితో ఘర్షణ పడ్డాడు. అప్పటి నుంచి మంగ్లీబాయి కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. రాములుపై అనుమానంతో కుటుంబ సభ్యులు అతడిని నిలదీయగా చెరువు కుంట వద్ద హత్య చేసినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం గ్రామానికి వచ్చి కుంటలో నుంచి మంగ్లీబాయి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితున్ని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. తల్లి వద్ద ఉన్న డబ్బులు, వెండి ఆభరణాల కోసమే రాములు హత్య చేశాడని మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ పేలి చెరుకు తోట దగ్ధం



దగ్ధమైన చెరుకుతోట వద్ద రైతు మల్లేశ్

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన రైతు నేతుల మల్లేశానికి చెందిన చెరుకు తోట మంగళవారం ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ పేలి మంటలు రావడంతో దగ్ధమైంది. మల్లేశ్ వ్యవసాయ బావి వద్ద విద్యుత్ సిబ్బంది కరెంట్ సరఫరా నిలిపివేసి ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేపట్టారు. పనుల అనంతరం కరెంట్ సరఫరాను పునరుద్ధరించగా ట్రాన్స్‌ఫార్మర్ పేలింది. మంటలు వ్యాపించి చెరుకు తోట, డ్రిప్ పైపులకు అంటుకున్నాయి. ఫైరింజన్‌కు సమాచారం అందించగా, వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. పంట దగ్ధం కావడంతో దాదాపు రూ. 3లక్షల వరకు నష్టం జరిగినట్లు రైతు మల్లేశం తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.

కోతుల దాడిలో బాలుడికి గాయాలు



గాయపడిన బాలుడు

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండల కేంద్రాలతో పాటు చుట్టుపక్క గ్రామాల్లో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. మహమ్మద్ నగర్, బూర్గుల్ గ్రామాల్లోని ఇద్దరు చిన్నారులపై మంగళవారం కోతులు దాడి చేసి గాయపర్చాయి. కోతుల దాడిలో గాయపడిన చిన్నారులను వారి తల్లిదండ్రులు ఆస్పత్రులకు తరలించి చికిత్సలు చేయించారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో కోతులు గుంపులు, గుంపులుగా ఉంటున్నాయి. అంతేకాకుండా మధ్యాహ్న భోజన సమయంలో కోతులు తమ ప్లేట్లను ఎత్తుకెళ్లుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి గ్రామాల్లో కోతుల బెడదను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జానకంపేటలో వ్యక్తి దారుణ హత్య



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేట గ్రామంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. జానకంపేట గ్రామంలో నివసిస్తున్న బత్తుల నరసయ్య (50) రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండడాన్ని స్థానికులు గమనించి ఎడపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై ఇలియాస్, తన బృందంతో వెంటనే ఘటన స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు. రక్తపు మడుగులో ఉన్న ఈలపీటను స్వాధీనం చేసుకున్నారు. తలకు బలమైన గాయం చేతనే వ్యక్తి మృతిచెంది ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతుడికి కొడుకు, కూతురు ఉండగా, కూతురికి ఇటీవల వివాహం జరిగింది. ఇంట్లో తన కొడుకుతో అతడు నివాసం ఉంటున్నాడు. దీంతో కొడుకు బత్తుల శేఖర్ నుంచి పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

లింగారెడ్డిపేటలో ఒకరి అదృశ్యం



ఎల్లారెడ్డి: మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామానికి చెందిన షేక్ అహ్మద్ అదృశ్యమైనట్లు ఎస్సై మహేష్ మంగళవారం తెలిపారు. మటన్ షాపులో పనిచేసే షేక్ అహ్మద్(47)కు గత కొన్నేళ్లుగా మానసిక స్థితి సరిగాలేదు. ఈనెల 24న అతడు తన ఇంటినుంచి బయటకు వెళ్లి ఇప్పటికీ తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో అతడి భార్య బేగరి పొలవ్వ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

పేకాట ఆడుతున్న పలువురి అరెస్టు

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఎస్సీ, బీసీ కాలనీలోగల ఓ ఇంటిలో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి పక్కా సమాచారంతో దాడి చేయగా పేకాడుతున్న వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద ఉన్న రూ.2,35,470 నగదును, 7మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

పెద్దకొడప్‌గల్ మండలంలో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని కస్లాబాద్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు ఎస్సై మహేందర్ సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద ఉన్న 24వేల380రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

టీచర్‌కు షోకాజ్ నోటీసు

నిజామాబాద్ అర్బన్: నగరంలోని పూలాంగ్ ప్రాథమిక పాఠశాల టీచర్ నాగరాజుకు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. డీఈవో మంగళవారం పాఠశాలను తనిఖీ చేసిన సమయంలో నాగరాజు విధుల్లో లేకపోవడంతో నోటీసు ఇచ్చారు. ఇదే పాఠశాలలో మరో ఇద్దరు ఉపాధ్యాయులు అందుబాటులో లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ చేపడతామన్నారు.